సాక్షి
తిరుపతి

శనివారం, 11, మే, 2024



పుత్తూరులో జరిగిన సభకు పోటెత్తిన అభిమానులు (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పక్కన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్కే.రోజా, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప



మండే ఎండను మనసులోని అభిమానం అధిగమించింది.. ఉప్పొంగే ఉత్సాహం నడుమ వేసవి తీవ్రత చిన్నబోయింది.. జయహో జగన్ నినాదాలతో పుత్తూరు మార్మోగింది.. ఎన్నికల ప్రచారంలో భాగంగా విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు అశేష జనసందోహం తరలివచ్చింది.. సంక్షేమ సారథి ప్రసంగానికి కరతాళధ్వనులతో సంపూర్ణ మద్దతు తెలిపింది.. ప్రజాప్రభుత్వానికి అండగా ఉండాలని పిలుపునిస్తే.. ఫ్యాను గుర్తుకే ఓటేస్తామని ముక్తకంఠంతో బదులిచ్చింది. నవరత్న పథకాలు అందాయా అని ప్రశ్నిస్తే.. అందాయన్నా.. అంటూ హర్షాతిరేకాలు వ్యక్తం చేసింది. కూటమి కుట్రలను ఎండగడితే.. మీ వెంటే మేముంటాం అంటూ నినదించింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను విజయీభవ అంటూ ఆశీర్వదించింది.

విజయీభవ

- సీఎం వైఎస్ జగన్ సభకు పోటెత్తిన ప్రజానీకం
- ముఖ్యమంత్రి ప్రసంగానికి ఆద్యంతం స్పందన అద్భుతం
- మండుటెండలోనూ స్వచ్ఛందంగా తరలివచ్చిన అశేష జనసందోహం
- వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప,రోజా గెలుపు తథ్యమంటున్న జనం

సాక్షి, చిత్తూరు/నగరి : ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం నగరి నియోజకవర్గం పుత్తూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యింది. సభకు వేలాదిమంది స్వచ్ఛందంగా తరలివచ్చారు. పట్టణం కిక్కిరిసింది. ఈ సందర్భంగా సీఎం జగన్ ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రజలను ఆలోచింపజేసింది.

హోరెత్తిన జగన్నినాదం

ముఖ్యమంత్రి సభలో జై జగన్ నినాదం హోరెత్తింది. తీవ్రమైన ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజానీకం కేరింతలు కొట్టింది. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ చంద్రబాబు 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసినా, సొంత జిల్లాకు సైతం ఏమీ చేయలేకపోయారని విమర్శించారు. ఆయన పేరు చెబితే ఒక్క పథకమైనా గుర్తుకు వస్తుందా అని ప్రశ్నించారు. 2014 మేనిఫెస్టోలో ప్రకటించిన ఒక్క హామీని కూడా చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. ఇప్పుడు మళ్లీ సూపర్ సిక్స్ పేరుతో మోసం చేసేందుకు వస్తున్నారని హెచ్చరించారు. 2019లో ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేశామని, పేదలందరికీ పక్కాగా సంక్షేమ పథకాలు అందించామని వెల్లడించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని, చంద్రబాబుకు ఓటేస్తే అన్ని పథకాలు ముగింపు పలుకుతారని వివరించారు.

జగనన్న మొనగాడు.. చంద్రబాబు మోసగాడు

ఎన్నికల బరిలో సింగిల్‌గా దిగిన జగనన్న మొనగాడని, ఓట్ల కోసం నానా గడ్డి కరిచే చంద్రబాబు మోసగాడని మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సభలో ఆమె ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. జగనన్నను ఢీకొట్టే దమ్ము లేకే చంద్రబాబు ఢిల్లీ నుంచి మోదీని, హైదరాబాద్ నుంచి పవన్ కల్యాణ్‌ను, పక్కరాష్ట్రాల నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డిని, బీజేపీ నుంచి వదినమ్మను, కాంగ్రెస్ నుంచి చెల్లెమ్మను, అలాగే రామోజీని, రాధాకృష్ణను, మందకృష్ణను, నిమ్మగడ్డ రమేష్‌ను తీసుకువచ్చారని విమర్శించారు. అటు వైపు ఎందరు వస్తున్నా ఈ వైపు వార్ వన్ సైడ్ అంటూ జగనన్న నిజాయితీగా నిలబడ్డారన్నారు. ఆయన వెంట జనం సైనికుల్లా ఉన్నారని తెలిపారు. ఎన్నికలు వస్తే చంద్రబాబుకు అబద్ధాలు తన్నుకు వస్తాయన్నారు. 2014లో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి సూపర్ సిక్స్ అంటూ వచ్చారని, దాన్ని కూడా వదిలేసి ఇప్పుడు కొత్త మేనిఫెస్టో అంటున్నారని ఎద్దేవా చేశారు. 13వ తేదీన పోలింగ్ బూత్‌లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై బటన్‌ను నొక్కాలని పిలుపునిచ్చారు.

కన్నతల్లే ఛీకొట్టిన కొడుకు భానుప్రకాష్

కన్నతండ్రి ముద్దుకృష్ణమ నాయుడును భానుప్రకాషే చంపాడని అతని తల్లి, తమ్ముడు చెబుతున్నారని వెల్లడించారు. చివరకు కన్న తల్లే ఛీకొట్టిన కుమారరత్నం భానుప్రకాష్ అన్నారు. కన్న తల్లి మన్ననలు పొందలేని కొడుకు ప్రజల మన్ననలు ఎలా పొందగలడని ప్రశ్నించారు. నగరిలో ఒక మహిళ అయిన తనను ఎదిరించలేక గుంపులుగా వస్తున్నారని మండిపడ్డారు. జగనన్న ఇచ్చిన పదవులు అనుభవించి ఆయనకే వెన్నుపోటు పొడిచిన గుంపును కూడా కలుపుకున్నారన్నారు. ఈ గుంపులకు ప్రజలే ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. తన వెంట ప్రజలకు సేవచేసే ప్రజాప్రతినిధులుంటే, భానుప్రకాష్ వెంట గంజాయి స్మగ్లర్లు, పీడీ యాక్ట్‌లో ఉన్న వారు, ఎర్రచందనం స్మగ్లర్లు, ఇసుక స్మగ్లర్లు, హత్యాయత్నం చేసి జైలుకు వెళ్లి వచ్చినవారే ఉన్నారని వివరించారు. ఎవరికి ఓటు వేస్తే నగరి అభివృద్ధి జరుగుతుందో ఆలోచించాలని సూచించారు. ఇంటికి వెళ్లగానే ఫ్యాన్ బటన్ నొక్కితే చల్లని గాలి వస్తుంది, పోలింగ్ బూత్‌కు వెళ్లి ఫ్యాన్ గుర్తున్న బటన్ నొక్కితే చల్లని పాలన వస్తుందని స్పష్టం చేశారు.



ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్కే రోజా



అదుగదుగో జగన్ మామ!

టీడీపీలో గుబులు

ముఖ్యమంత్రి రాకతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. ఈ క్రమంలోనే టీడీపీలో గుబులు మొదలైంది. సీఎం సభకు పెద్దసంఖ్యలో జనం స్వచ్ఛందంగా తరలిరావడంతో పచ్చనేతల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ముఖ్యమంత్రి ప్రసంగానికి ప్రజల నుంచి వచ్చిన స్పందనను చూసి వారిలో అంతర్మథనం ప్రారంభమైంది. ఇదే క్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయం ఎన్నికలకు ముందే ఖరారైనట్లు పట్టణవాసులు చర్చించుకోవడం కనిపించింది.



మేనమామ కోసం..



జై జగన్



మనవడిని చూశా.. చాలు!



ఈల వేసి.. ప్రత్యేకతను చాటి!



ఉప్పొంగిన ఉత్సాహం



దండాలయ్యా..మాతోనే నువ్వుండాలయ్యా!



అభిమాన నేత రాక కోసం మండుటెండలో ఎదురు చూస్తూ..



మా నమ్మకం నువ్వే జగనన్నా : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన ఆనందంలో చేతులూపి ఉత్సాహంతో కేరితలు కొడుతున్న ప్రజలు



నీరాజనం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం

క్లుప్తంగా

కత్తితో దాడి

తడ: పాత గొడవల నేపథ్యంలో రామాపురంలో గురువారం రాత్రి ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేయడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ పీ.నరసింహరావు కథనం.. రామాపురానికి చెందిన ఆంబాకం హేమనాథన్‌కి, అదే గ్రామానికి చెందిన అముదకి పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో అముద, హేమనాథన్‌లు మళ్లీ గొడవ పడ్డారు. ఆ విషయం తెలుసుకున్న అముద కుమారుడు ఆకాష్ సంఘటనా స్థలానికి చేరుకుని మచ్చు కత్తితో హేమనాథన్‌పై దాకి దాడి చేశాడు. దీంతో అతనికి రక్తగాయాలయ్యాయి. అనంతరం బాధితుడు శ్రీసిటీలోని ప్రైవేట ఆస్పత్రిలో చికిత్సపొంది శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

తడ : అక్కంపేట జాతీయ రహదారిపై తడ నుంచి సూళ్లూరు పేటకు నడిచి వెళుతున్న గర్తు తెలియని వ్యక్తి(58)ని అదే మార్గంలో బైక్‌పై నాయుడుపేట వెళుతున్న సతీష్ వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా స్థానికులు వీరిని 108లో సూళ్లూరుపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుర్తు తెలియని వ్యక్తిని గూడూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతునికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

వడదెబ్బకు వృద్ధురాలి మృతి


లీలావతమ్మ(ఫైల్)

చంద్రగిరి: వడదెబ్బతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. కల్‌రోడ్డుపల్ల పంచాయతీ, ఆముదాలకోన ఎస్టీ కాలనీకి చెందిన పాలకూర లీలావతమ్మ(72) పశువులను మేపుకుంటూ జీవనం సాగిస్తోంది. రోజూవారీలా గురువారం పశువులను మేపడానికి తీసుకెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన లీలావతమ్మ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఎండ తీవ్రతను తట్టుకోలేక రాత్రి ఇంట్లోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చిత్తూరు రౌడీలు మనకొద్దు

- తిరుపతి అభివృద్ధే శ్వాసగా అభినయ్ కృషి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన


తిరుపతి 3వ డివిజన్‌లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: 'ఈ ఎన్నికలు చిత్తూరు రౌడీలకు, తిరుపతిలోని సౌమ్యుల మధ్య జరుగుతున్నాయి. ఈ యుద్ధంలో మీకు చిత్తూరులో అరాచకాలు, దోపిడీలు చేసిన గజ దొంగలు కావాలో.. తిరుపతి అభివృద్ధే శ్వాసగా ముందుకు వెళ్తున్న సౌమ్యులు కావాలో తేల్చుకోండి' అని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి 3వ డివిజన్‌లో కార్పొరేటర్ తమ్ముడు గణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి జగనన్న అందించిన సంక్షేమం, తిరుపతిలో అభినయ్ చేసిన అభివృద్ధిని వివరించారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ చిత్తూరులో చేసిన అరాచకాలు, అక్రమాలు చాలక తిరుపతి పవిత్ర పుణ్య క్షేత్రంలో అలజడులు సృష్టించేందుకు వచ్చిన నీచుడే ఆరణి శ్రీనివాసులు అని మండిపడ్డారు. జీవితమే పాపాలపుట్ట అయిన ఆరణి శ్రీనివాసులు తమ కుటుంబంపై అవినీతి ఆరోపణలు చేయడం అతని నీచత్వానికి నిదర్శనమన్నారు. అక్రమ సంపాదన కోసం, పదవుల కోసం రాజకీయ వ్యభిచారిగా మారిన ఆరణి శ్రీనివాసులకు తమ జీవితం, తమ కుటుంబం గురించి మాట్లాడే హక్కులేదన్నారు. చిత్తూరు ఆకురౌడీకి, తిరుపతి అభివృద్ధే శ్వాసగా సాగుతున్న అభినయ్‌కి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో అభినయ్‌ని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, నాయకులు వెంకటేష్‌రాయల్, మునిరెడ్డి, కుమార్, అంజుబాయ్, పాండు, కన్న, రాజేష్, సాగర్, వెంకీ, కళావతి, రాములమ్మ, ప్రమీలమ్మ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో నిరంతర విద్యుత్


తిరుపతి రూరల్ డివిజన్ పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి

తిరుపతి రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ నిరంతర విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుపతిలోని విద్యుత్ నిలయం నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఈఈలు, డీఈలు, ఏఈలతో సమీక్షా నిర్వహించారు. ప్రతి ఏఈ తమ పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్‌ను తనిఖీ చేసి అక్కడ ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించి, ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ లైన్లను సరిచేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద విద్యుత్ అధికారుల సెల్ నంబర్లను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి డీఈ వద్ద అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులో ఉంచాలని చెప్పారు. తిరుపతి సర్కిల్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, సమస్యలు ఏమైనా ఉంటే 9440817412 నంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. అంతకు ముందు పుత్తూరు, తిరుపతి డివిజన్ పరిధిలో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన పోలయ్య

దొరవారిసత్రం : జాతీయ రహదారి దాటుతున్న క్రమంలో అటుగా వస్తున్న బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలోని వీఎస్ఆర్ నగర్ వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. గొల్లపాళెం గ్రామం, ఎస్టీ కాలనీకి చెందిన పోలయ్య(42) సొంత పనిపై వెళ్లి తిరిగి వీఎస్ఆర్ నగర్ వద్ద జాతీయ రహదారిని దాటుతున్నాడు. అదే సమయంలో సూళ్లూరుపేట నుంచి నాయుడుపేట వైపు వెళ్తున్న ఓ బైక్ పోలయ్యను బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన పోలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 2024–25వ విద్యా సంవత్సరంలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 'ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా జూన్ 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 94928 61369, 93989 62635, 94908 06942 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 65,508 మంది స్వామివారిని దర్శించుకోగా, 25,996 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులో కానుకల రూపంలో హుండీలో రూ.2.97 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో స్వామివారి దర్శనం లభిస్తోంది.

మాయలోడు చంద్రబాబు


రామ్‌కుమార్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న స్థానికులు

సైదాపురం: ఎన్నికల వేళ చంద్రబాబునాయుడు మాయ మాటలను నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మండలంలోని మర్లపూడి, చాగణం, సైదాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో అలవికాని హామీలిచ్చి చేతులు పైకెత్తేశారని ఎద్దేవా చేశారు. మళ్లీ ఇప్పుడు సూపర్ సిక్స్ అంటూ పక్క రాష్ట్రాల పథకాలు కాపీ కొట్టి మేనిఫెస్టో విడుదల చేయడం సిగ్గు చేటన్నారు. బాబును నమ్మితే నట్టేట మునిగిపోవడం తథ్యమన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పే మాయమాటలు నమ్మి ఎవ్వరు మోసపోవద్దని ఆయన ప్రజలకు సూచించారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు ముద్రించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వెంకటగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 76 వేల ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాల విషయాలపై సమగ్రంగా వివరించామన్నారు. తిరుపతి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. గత పదేళ్లగా ఎమ్మెల్యేగా కొనసాగిన ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ మన్నారపు రవికుమార్, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు శివకుమార్, నేతలు బండి వెంకటేశ్వరురెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి, చీర్ల బ్రదర్స్, కె.సుబ్బారెడ్డి, చంద్రాశేఖర్‌రెడ్డి, చంద్రారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, యోగి, రాఘవరెడ్డి, సాంబయ్య, సుధీర్, శివకుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పుష్పయాగం రేపు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఈనెల 12వ తేదీ ఆదివారం పుష్పయాగాన్ని నేత్రపర్వంగా నిర్వహించనున్నారు. ఈమేరకు శనివారం సాయంత్రం పుష్పయాగానికి అంకురార్పణ జరగనుంది. పుష్పయాగం రోజైన ఆదివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు స్వామి, అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం శ్రీసీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి వారికి పలు రకాల పుష్పాలతో అభిషేకం చేస్తారు. తర్వాత రాత్రి 7 గంటలకు శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. గృహస్తులు ఇద్దరు రూ.వెయ్యి చెల్లించి టికెట్ కొనుగోలు చేసి పుష్పయాగంలో పాల్గొనవచ్చు. గత నెల 5 నుంచి 13వ తేదీ వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వ హించిన విషయం విదితమే. ఈ బ్రహ్మోత్సవాల్లో, నిత్యకైంకర్యాల్లో తెలిసీతెలియక జరిగిన లోపాలు ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

జిల్లా కేంద్రం నుంచే పోలింగ్ మానిటరింగ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: ఎన్నికల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎవరికి కేటాయించిన విధులు వారు సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 13న జరగనున్న ఎన్నిక పోలింగ్‌ను జిల్లా కేంద్రం నుంచే మానిటరింగ్ చేస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజున పోలింగ్ ప్రక్రియను పరిశీలించడానికి జిల్లా ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలలో ప్రసారమయ్యే ఎన్నికల ప్రతికూల అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి మీడియా మానిటరింగ్ కంట్రోల్ రూమ్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో పెంచలకిషోర్, ఎస్డీసీ మురళి, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, డీఎల్‌డీఓ సుశీలాదేవి, సీపీఓ ప్రేమ్‌చంద్రారెడ్డి, సమాచారశాఖ జిల్లా అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

నేటితో ఎన్నికల ప్రచారానికి తెర

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 6 గంటలకు ముగియనుంది. ఆ మేరకు అధికారులు అన్ని రాజకీయ పార్టీల నేతలకు స్పష్టంగా తెలియజేశారు. మరోవైపు పోలింగ్ మరో 48 గంటల్లో ప్రారంభంకానుంది. సోమవారం ఉదయం 7 గంటల లోపు ఆయా రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్ల సమక్షంలో పీవోలు మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఆపై పోలింగ్ ప్రారంభించనున్నారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. పోలింగ్ మరుసటి రోజు వరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ కొనసాగనుంది. పోలింగ్ రోజు మద్యం విక్రయాలు పూర్తిగా నిలుపుదల చేయనున్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఏర్పేడు: కృష్ణంపల్లిలో ఓ వ్యక్తిపై దాడిచేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని కృష్ణంపల్లిలో పూజారి చెంగల్రాయులురెడ్డిని అదే గ్రామానికి చెందిన రోగిరెడ్డి, రమేష్‌రెడ్డి, జయభూతగాదాతో ఈనెల 5న దాడిచేసి గాయపరిచినట్లు వివరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సీఎంకు సాదర స్వాగతం

రేణిగుంట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఆయనకు విమానాశ్రయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కేజే కుమార్, కేజే శాంతి పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు. ఆయన అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నగరి నియోజకవర్గ పర్యటనకు బయలుదేరి వెళ్లారు.

మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో మే 14(మంగళవారం) నుంచి 30 రోజుల మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ పీ.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగి, తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలన్నారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కి ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు కూడా అందజేస్తామన్నారు. ఆసక్తిగల వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 63017 17672 సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 20 టీడీపీ కుటుంబాలు


కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పట్టణంలోని 14వ వార్డులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కలిమిలిరాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో 20 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థి ఎం.గురుమూర్తిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య, నాయకులు వెంకటరత్నంరాజు, నారాయణ, సీనయ్య, శ్రీరామ్ రమణమ్మ, బాబ, రవి, పోలయ్య, వెంకటయ్య, చంటి పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీల్లో తిరుపతికి తృతీయ స్థానం


పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను అభినందిస్తున్న తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి

తిరుపతి రూరల్: రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీల్లో తిరుపతి సర్కిల్ కల్చరల్ విభాగంలో రాష్ట్రంలో తృతీయ స్థానం కైవసం చేసుకుంది. ఈనెల 1, 2, 3 తేదీలలో ఆర్టీపీపీలో చేసిన పోటీల్లో విశేష ప్రతిభ చూపిన తిరుపతి సర్కిల్ విద్యుత్ ఉద్యోగులు మూడో స్థానంలో నిలిచారు. 7, 8, 9 తేదీలలో నెల్లూరులో జరిగిన పురుషుల అథ్లెటిక్ విభాగంలో తిరుపతి జట్టుకు ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం దక్కింది. ఈ సందర్భంగా విజయానికి కారకులైన క్రీడాకారులు అందరూ తిరుపతి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు మూగా.కృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీ వాసుదేవరెడ్డిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. క్రీడాకారులను అధ్యక్షుడు కృష్ణారెడ్డి దుశ్శాలువతో సత్కరించి, అభినందించారు. విద్యుత్ ఉద్యోగుల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కార్యదర్శి పురుషోత్తం, కోశాధికారి లీలారామ్, మూర్తిరాజు, కల్చరల్ సెక్రటరీ జయచంద్ర, ఉద్యోగులు పాల్గొన్నారు.


వడ్డిపాళెంలో తీవ్ర విషాదం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి


ప్రమాదంలో మృతి చెందిన వేణు

పెళ్లకూరు: మండలంలోని వడ్డిపాళెంలో తీవ్ర విషాదం నెలకొంది. నెల్లూరు జిల్లా, మనుబోలు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిల్లకూరు వడ్డిపాళెం గ్రామానికి చెందిన బండి వేణు(18), చల్లా ఆకాష్(19)మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. వివరాలు.. గ్రామానికి చెందిన చల్లా నరేష్, చెంచు దంపతుల కుమారుడు ఆకాష్ నాయుడుపేటలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అలాగే అదే గ్రామానికి చెందిన బండి చంద్ర, నాగమ్మ దంపతుల కుమారుడు వేణు ఇంటర్‌లో చదువు మానేసి మెగా ఇన్‌ఫ్రా కంపెనీలో పనిచేస్తున్నాడు. వేణు, ఆకాష్ ఇద్దరూ కలిసి మోటార్ బైక్‌లో నెల్లూరుకు వెళుతుండగా మార్గ మధ్యంలో మనుబోలు వద్ద ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో వేణు, ఆకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వేణు అక్కడికక్కడే మృతి చెందగా.. ఆకాష్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందాడు. చేతికొచ్చిన కొడుకులు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు గుండెలు బాదుకుంటూ రోదించిన తీరు అందరినీ కలచివేసింది. ఇంటికి ఆధారంగా ఉంటారనుకుంటే మధ్యలోనే తీసుకెళ్లిపోయావా.. దేవుడా..! అంటూ దిక్కులు పిక్కటిల్లేలా రోదించడం చూపరులకు కన్నీళ్లు తెప్పించింది.

కారు ఢీ.. డ్రైవర్ మృతి


మృతి చెందిన పరదేశ్

దొరవారిసత్రం: జాతీయ రహదారి దాటుతున్న టిప్పర్ లారీ డ్రైవర్‌ను కారు ఢీకొన్న ఘటనలో అతను అక్కడికక్కడే మృతిచెందిన ఘటన గురువారం అర్ధరాత్రి నెల్లబల్లి గ్రామ సమీపం తెలుగు గంగ కాలువ వద్ద చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం.. చిల్లకూరు మండలం, చిత్తవరం గ్రామానికి చెందిన పరదేశ్ లారీ డ్రైవర్. ఈ క్రమంలో గురువారం చిత్తవరం నుంచి సిలికాను టిప్పర్ లారీలో లోడ్ చేసుకుని తడ ప్రాంతంలోని కంపెనీలో అన్‌లోడ్ చేసి నెలబల్లి గ్రామ సమీపంలో రహదారి వెంబడే ఉన్న దుకణాల వద్ద లారీని ఆపాడు. ఈ క్రమంలో రోడ్డు దాటుతున్న సమయంలో నెల్లూరు నుంచి చెన్నైకి వేగంగా వెళ్తున్న కారు ఢీకొనడంతో శ్రీరామ్‌పరదేశ్(60) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన కారును అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

చీరలు, కారు స్వాధీనం

– టీడీపీ నేతను వదలిపెట్టిన పోలీసులు


స్వాధీనం చేసుకున్న చీరలు

ఏర్పేడు: మండలంలోని కోబాక గ్రామ సమీపం, బండారుపల్లి క్రాస్ రోడ్డులో శుక్రవారం రాత్రి టీడీపీకి చెందిన చీరలు, కారును పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అయితే కారులోని మునగలపాళెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మోహన్‌రావును పోలీసులు వదలిపెట్టారని సమాచారం. స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఆయుష్ అందించిన వివరాలు.. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలోని కోబాక సమీపంలోని బండారుపల్లి క్రాస్ రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఏర్పేడు నుంచి కోబాక వైపు వెళుతున్న కారును ఆపారు. కారులో ఎలాంటి రసీదులు లేకుండా తరలిస్తున్న 33 చీరలను గుర్తించారు. పట్టుబడిన కారు, చీరలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కారులో ఉన్న టీడీపీ నాయకుడిని పోలీసులు అరెస్ట్ చేయకుండా వదలిపెట్టేశారు. వెంటనే టీడీపీ నాయకుడిని అరెస్ట్ చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.